

నల్లగొండ ప్రతీక్ జూనియర్ కళాశాల సెంటర్‌లోకి వెళ్తున్న విద్యార్థులు

## ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు

**జిల్లాలో 52 పరీక్ష కేంద్రాలు**

**తొలి రోజు 692 మంది విద్యార్థుల గైర్హాజరు**

**నిమిషం నిబంధనతో పలువురిని పరీక్షలకు అనుమతించని అధికారులు**

నల్లగొండ రూరల్, ఫిబ్రవరి 28 : ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం వార్షిక పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 50 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. తొలి రోజు జరిగిన తెలుగు, సంస్కృతం పరీక్షకు జిల్లాలో 14,944 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 14,252 మంది హాజరయ్యారు. 692 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జనరల్ విద్యార్థులు 12,714 మందికిగాను 12,235 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. 479 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్‌లో 2,230 మందికిగాను 2,017 మంది విద్యార్థులు హాజరు కాగా.. 213 మంది గైర్హాజరయ్యారు. ఒక నిమిషం ఆలస్యం నిబంధనతో పలువురు విద్యార్థులు పరీక్ష రాయలేకపోయారు. జిల్లా కేంద్రంలోని కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి బాలుర జూనియర్ కళాశాలలో ఒకరు, హాలియాలో ముగ్గురు, మిర్యాలగూడలో ముగ్గురు, నాగార్జునసాగర్‌లో ఐదుగురు, దామరచర్లలో ఇద్దరు విద్యార్థులు ఆలస్యంగా వచ్చిన కారణంగా అధికారులు పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించలేదు. ఈ క్రమంలో నిమిషం ఆలస్యం నిబంధనపై విద్యార్థులను పూర్తి స్థాయిలో చైతన్యం చేయడంలో అధికారులు విఫలమయ్యారని తల్లిదండ్రులు ఆరోపించారు.

## మోసపూరిత ఏజెన్సీలపై కఠినంగా వ్యవహరిస్తాం

• కలెక్టర్ వెంకట్రావ్

సూర్యాపేట, ఫిబ్రవరి 28 : మోసపూరిత అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీలపై కఠినంగా వ్యవహరిస్తామని జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉద్యోగాల కోసం మోసపూరిత మాటలు నమ్మి ఆర్థికంగా నష్టపోవద్దని యువతకు సూచించారు. కలెక్టరేట్‌లో శానిటేషన్ కోసం కమిటీ ద్వారా ముగ్గురు స్కావెంజర్లను నియమించాలని నిర్ణయించినట్లు తెలిపారు. అందుకు టెండర్ నిర్వహించి మణికంఠ ఏజెన్సీ ద్వారా 2023 సెప్టెంబర్‌లో ముగ్గురిని ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. కానీ.. ఉద్యోగాల పేరుతో మణికంఠ ఏజెన్సీ ఇతరుల నుంచి డబ్బు వసూలు చేయడం కలెక్టరేట్‌కు సంబంధం లేదని స్పష్టం చేశారు. బద్నాం చేసే ఏజెన్సీలపై కఠినంగా వ్యవహరిస్తామని కలెక్టర్ హెచ్చరించారు. కమిటీ ద్వారా ఔట్ సోర్సింగ్‌లో ఎంపిక విధానాన్ని ఎస్పీకి పంపించి విచారణ చేయాలని కోరినట్లు తెలిపారు. నిరుద్యోగుల నుంచి డబ్బు వసూలు చేసిన మణికంఠ ఏజెన్సీపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. యువత మోసపోకుండా సంబంధిత శాఖల అధికారులను సంప్రదించి ఉపాధి కల్పన కార్యాలయంలో ఉద్యోగ వివరాలు తెలుసుకోవాలని సూచించారు.

# ఉత్తమ్ రారు.. స్కూటీలు ఇవ్వరు!

## కలెక్టరేట్‌లో మూలుగుతున్న మూడు చక్రాల స్కూటీలు

- దివ్యాంగులకు మంజూరు చేసిన కేసీఆర్ ప్రభుత్వం
- ఎన్నికల కోడ్‌తో ఆగిన పంపిణీ
- రెండు నెలలుగా మంత్రి టైమ్ కోసం ఎదురుచూపులు

మంత్రి ఉత్తమ్ సారూ.. కొంచెం టైమ్ ఇచ్చి మూడు చక్రాల స్కూటీలు పంపిణీ చేయరాదూ.. అని దివ్యాంగులు కోరుతున్నారు. దివ్యాంగుల కోసం కేసీఆర్ ప్రభుత్వం చేసిన మూడు చక్రాల స్కూటీలు కలెక్టరేట్ కారిడార్‌లో రెండు నెలలుగా మూలుగుతున్నాయి. పంపిణీకి ఏర్పాట్లు చేసినా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి టైమ్ ఇవ్వకపోవడంతో రెండు సార్లు వాయిదా పడింది. దాంతో స్కీమ్‌లో ఎంపికైన 15 మంది దివ్యాంగులు మంత్రి ఎప్పుడొస్తారో.. స్కూటీలు ఎప్పుడిస్తారోనని ఎదురు చూస్తున్నారు.

– సూర్యాపేట, ఫిబ్రవరి 28

కేసీఆర్ ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి ఎంతో కృషి చేసింది. ఇందులో భాగంగా ప్రతి సంవత్సరం దివ్యాంగ విద్యార్థులు, యువతకు మూడు చక్రాల స్కూటీలు అందించేందుకు చర్యలు చేపట్టింది. ఈ పథకం కోసం జిల్లా వ్యాప్తంగా 140 మంది దరఖాస్తు చేసుకోగా లబ్ధిదారులను ఎంపిక చేసింది. వారికోసం 15 స్కూటీలు మంజూరు చేసింది. కానీ.. శాసనసభ ఎన్నికల కోడ్ రావడంతో పంపిణీ ఆగిపోయింది. ఎన్నికల కోడ్ ముగిశాక ఇస్తామని అధికారులు చెప్పుకొంటూ వస్తున్నారు. ఇప్పుడు మంత్రి వస్తేనే పంపిణీ అంటున్నారు. దీంతో లబ్ధిదారులు నిరాశకు గురవుతున్నారు.

### ఒక్కొక్క వాహనం రూ.95 వేలు

జిల్లాకు 15 స్కూటీలు మంజూరు కాగా, వాటిని టీవీఎస్ కంపెనీ నుంచి ఒక్కొక్కటి రూ.95 వేలు పెట్టి కొనుగోలు చేశారు. మొత్తం రూ.14.15 లక్షలు పెట్టి కొనుగోలు చేసి దాదాపు మూడు నెలలు అయ్యింది. అయినా కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని పంపిణీ చేయడానికి ముందుకు రావడం లేదు.



కలెక్టరేట్‌లో పడిఉన్న మూడు చక్రాల స్కూటీలు

### జిల్లా కేంద్రానికి మంత్రి వచ్చింది ఒక్కసారే..

జిల్లాకు చెందిన రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి బాధ్యతలు తీసుకున్న తరువాత జిల్లా కేంద్రంలో పర్యటనలు చేయడం, ఉన్నతాధికారులతో సమీక్షలు నిర్వహించడం జరుగలేదు. కాంగ్రెస్ నాయకుడి విగ్రహ ఆవిష్కరణకు ఒక్కసారి మాత్రమే జిల్లా కేంద్రానికి వచ్చారు. కలెక్టరేట్ వైపు కనీసం కన్నెత్తి కూడా చూడలేదు. జిల్లా యంత్రాంగం ఏం చేస్తుంది.. పాలన ఎలా సాగుతుందో పట్టించుకోలేదు. అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించిన దాఖలాలు లేవు.

# కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కు రాజకీయం

**భువనగిరిలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ పదవుల పంపకం**

- కాంగ్రెస్‌కు చైర్మన్.. బీజేపీకి వైస్ చైర్మన్ పదవి
- 17 మంది కౌన్సిలర్లు ఉన్నా వైస్ చైర్మన్ పదవికి పోటీ చేయని కాంగ్రెస్
- ఎన్నికలపై కౌన్సిలర్ల అసంతృప్తి.. ఒకరి రాజీనామా



మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ ఎన్నిక నిర్వహిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.జయశ్రీ, చిత్రంలో చైర్మన్‌గా ఎన్నికైన పోతంశెట్టి

యాదాద్రి భువనగిరి, (నమస్తే తెలంగాణ) / భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 28 : జిల్లాలో కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కు రాజకీయానికి తెరలేపాయి. బయటకు రోజంతా ఒకదానిపై మరికొకటి దుమ్మెత్తి పోసుకునే ఆ రెండు పార్టీలు పదవుల దగ్గరికి వచ్చేసరికి ములాఖత్ అయ్యాయి. భువనగిరి మున్సిపాలిటీలో ఒకరికొకరు పరస్పరం సహకరించుకుని పదవులను పంచుకున్నాయి. ఎలాగైనా బీఆర్‌ఎస్‌ను దెబ్బతీయాలని కుట్రలకు పాల్పడ్డాయి. భువనగిరి మున్సిపల్ చైర్మన్ కాంగ్రెస్, వైస్ చైర్మన్ బీజేపీ సభ్యులు చేజిక్కించుకున్నారు. గత నెలలో బీఆర్‌ఎస్ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టి పడగొట్టిన విషయం తెలిసిందే. బుధవారం భువనగిరి మున్సిపల్ ఆఫీసులో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.జయశ్రీ సమక్షంలో చైర్మన్, వైస్ చైర్మన్ కోసం ఎన్నిక నిర్వహించారు. మొత్తం 35 మంది కౌన్సిలర్లు, ఒక ఎక్స్‌అఫీషియో మెంబర్‌తో కలిపి 36 మంది కాగా, కౌన్సిల్ హాల్‌కు 30మంది సభ్యులు హాజరయ్యారు. చైర్మన్‌కు కాంగ్రెస్ నుంచి 29వ వార్డు కౌన్సిలర్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు పోటీలో నిలువగా 18 మంది అనుకూలంగా చేతులెత్తారు. కాంగ్రెస్‌కు అనుకూలంగా ముగ్గురు బీజేపీ కౌన్సిలర్లు చేతులెత్తడం గమనార్హం. చైర్మన్‌కు బీజేపీ సహకరించడంతో వైస్ చైర్మన్‌కు కాంగ్రెస్ మద్దతుగా నిలిచింది. వైస్ చైర్మన్‌కు బీజేపీకి చెందిన 25వ వార్డు కౌన్సిలర్ మాయ దశరథ ఒక్కరే పోటీలో ఉండడగా ఆయననే వైస్ చైర్మన్‌గా ప్రకటించారు.

### కాంగ్రెస్, బీజేపీ లోపాయికారి ఒప్పందం

భువనగిరి మున్సిపాలిటీలో 35 మంది వార్డు కౌన్సిలర్లు, ఒకరు ఎక్స్ అఫీషియో సభ్యుడితో కలిపి మొత్తం 36 మంది ఉన్నారు. ఇందులో టీఆర్‌ఎస్ 20, కాంగ్రెస్ 9, బీజేపీ కౌన్సిలర్లు ఆరుగురు. గతంలో బీఆర్‌ఎస్ పార్టీ చైర్మన్‌గా ఉన్న ఎన్నబోయిన ఆంజనేయులు, వైస్ చైర్మన్ చింతల కిష్టయ్యపై బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు మొత్తం 31 మంది అవిశ్వాసం పెట్టాలని కలెక్టరేట్‌లో వినతి పత్రం సమర్పించారు. గత నెలలో పెట్టిన అవిశ్వాసం నెగ్గడంతో చైర్మన్, వైస్ చైర్మన్ పదవులు ఖాళీ అయ్యాయి. ప్రభుత్వ ఆదేశం మేరకు బుధవారం మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికను నిర్వహించారు. ఈ ఎన్నికకు 29 మంది కౌన్సిలర్లు, ఎక్స్ అఫీషియో మెంబర్ ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి హాజరయ్యారు. మున్సిపల్ చైర్మన్ పదవికి ఎన్నిక నిర్వహించగా బీజేపీ నుంచి 9వ వార్డు కౌన్సిలర్ నల్లమాస సుమ 22వ వార్డు కౌన్సిలర్ బొర్ర రాకేష్ పేరును చైర్మన్ అభ్యర్థిగా ప్రతిపాదించగా, 21వ వార్డు కౌన్సిలర్ ఉదయగిరి విజయ్‌కుమార్ బలపరిచాడు. కాంగ్రెస్ పార్టీ నుంచి 11వ వార్డు కౌన్సిలర్ జిట్ట వేణుగోపాల్‌రెడ్డి 29వ వార్డు కౌన్సిలర్ పోతంశెట్టి వెంకటేశ్వర్లును చైర్మన్‌గా ప్రతిపాదించగా, 28వ వార్డు కౌన్సిలర్ కైరంకొండ వెంకటేశ్వర్లు బలపరిచాడు. చైర్మన్ ఎన్నిక ప్రక్రియలో ఇద్దరు పోటీలో ఉండడంతో చేతులెత్తి ఓటు వేసే ప్రక్రియను నిర్వహించారు. అలా బొర్ర రాకేష్‌కు ఐదుగురు బీజేపీ కౌన్సిలర్లు చేతులెత్తగా, పోతంశెట్టి వెంకటేశ్వర్లుకు కాంగ్రెస్ నుంచి 11, బీఆర్‌ఎస్ 3, బీజేపీ 3, ఎమ్మెల్యే కుంభంతో కలిపి 18 మంది ఓటు వేశారు. దాంతో పోతంశెట్టి వెంటేశ్వర్లు మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. వైస్ చైర్మన్‌గా బీజేపీ పార్టీ 25వ వార్డు కౌన్సిలర్ మాయ దశరథను 24 వ వార్డు కౌన్సిలర్ రత్నపురం బలరామ్ ప్రతిపాదించగా, 13వ వార్డు కౌన్సిలర్ జనగాం కవిత బలపరిచారు. వైస్ చైర్మన్ ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు 17 మంది ఉన్నా వైస్ చైర్మన్ పదవికి పోటీలో లేకపోవడంతో బీజేపీ, కాంగ్రెస్ లోపాయికారీతనం బట్టబయలైంది. బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు సమావేశం నుంచి బయటికి వెళ్లిపోవడంతో దశరథ వైస్ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

### చైర్మన్ ఎన్నికపై అసంతృప్తి.. 20వ వార్డు కౌన్సిలర్ రాజీనామా

మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ పదవులపై ఆశాభావంతో ఉన్న కౌన్సిలర్లు ఈ ఎన్నికపై అసంతృప్తిగా ఉన్నారు. 20వ వార్డు కౌన్సిలర్ పచ్చల హేమలతాజగన్ మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ కొండల్‌రావుకు తమ రాజీనామా పత్రాన్ని అందజేశారు. మున్సిపల్ చైర్మన్ అవిశ్వాసం జరిగిన నాటి నుంచి ఎన్నిక జరిగే రోజు వరకు తమ పేరును మున్సిపల్ చైర్మన్‌గా ప్రతిపాదించారని, తీరా ఎన్నిక నిర్వహించే సమయంలో మరొక కౌన్సిలర్ పేరు రావడంతో నివ్వెరపోయినట్టు చెప్పారు. ఎమ్మెల్యే మాటకు కట్టుబడి చేతులెత్తినట్టు తెలిపారు. మంత్రి కోమటిరెడ్డి, ఎమ్మెల్యే ఆదేశాల మేరకే ఇలా జరిగిందని, వారిపై అసంతృప్తిని వ్యక్తం చేస్తూ మరికొందరు కౌన్సిలర్లు పదవికి, పార్టీకి రాజీనామా చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తున్నది. కాగా, ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బీజేపీ సహకరించిందని, అందుకు ప్రతిఫలంగానే కమలం పార్టీకి వైస్ చైర్మన్ పదవిని కట్టబెట్టారని బీఆర్‌ఎస్ ఆరోపిస్తున్నది.

# కష్టజీవులపైకి మృత్యుశకటం

## కూలీల ఆటోను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

• ఐదుగురు దుర్మరణం.. మరొకరి పరిస్థితి విషమం • మూడు గ్రామాల్లో విషాదఛాయలు

**జీవన ప్రయాణంలో ఎన్నో ఆటుపోట్లను చూసినా వాళ్లు బతుకు పోరాటంలో మాత్రం ఎన్నడూ అలిసిపోలేదు. కలోగంజో తాగి రెక్కల కష్టం మీద కుటుంబాలను నెట్టుకుంటూ వచ్చారు. పిల్లలను చదివించుకున్నారు.. పెండ్లిండ్లు చేసి బాధ్యత తీర్చుకున్నారు. ఇప్పుడు ఏడు పదుల వయస్సులోనూ ఇతరులపై ఆధారపడకుండా శ్రమనే నమ్ముకుని బతుకుతున్న వారిపైకి ఆర్టీసీ బస్సు రూపంలో మృత్యువు దూసుకొచ్చింది. సూర్యాపేట జిల్లా మునగాల మండలం నుంచి మోతె మండలానికి మిర్చి కూళ్లకు వెళ్తున్న కూలీల ఆటోను బస్సు ఢీకొన్న ప్రమాదంలో ఐదుగురు కూలీలు దుర్మరణం చెందారు.**

– మునగాల, ఫిబ్రవరి 28



నారాయణమ్మ (ఫైల్)



నాగమ్మ (ఫైల్)



సౌభాగ్యమ్మ (ఫైల్)



అనసూర్య (ఫైల్)



గురువయ్య (ఫైల్)

మునగాల మండలం విజయరాఘవాపురం గ్రామానికి చెందిన రెమిడాల సౌభాగ్యమ్మ (75), కందుల గురువయ్య (70), రామసముద్రం గ్రామానికి చెందిన చెవుల నారాయణమ్మ (56), కందుల నాగమ్మ (65), రేపాల గ్రామానికి చెందిన పోకల అనసూయమ్మ (65) మోతె మండలంలోని పలు గ్రామాల్లో మిరపకాయలు ఏరేందుకు కొన్ని రోజుల నుంచి ఆటోలో వెళ్లి వస్తున్నారు. రోజు మాదిరిగా బుధవారం ఆటోలో వెళ్తుండగా విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారి వెంట మోతె మండలంలోని కేశవాపురం అండర్ పాస్ బ్రిడ్జి వద్ద ఖమ్మం నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న మధిర డిపోకు చెందిన ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నారాయణమ్మ, నాగమ్మ, సౌభాగ్యమ్మ అక్కడికక్కడే మృతి చెందారు. మరో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండడంతో సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. వారిలో అనసూర్య కూడా మరణించింది. గురువయ్య పరిస్థితి తీవ్ర విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, ఆయన అక్కడ మృతిచెందాడు. మరో కూలీ లక్ష్మి పరిస్థితి విషమంగా ఉన్నది. ప్రమాద సమయంలో ఆటోలో 12మంది కూలీలు ఉండగా.. ఆరుగురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ విజయరాఘవాపురం గ్రామానికి వెళ్లి బాధితుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రమాద వివరాలను అడిగి తెలుకున్నారు.

### ఒంటరి మహిళను వదలని మృత్యువు

విజయరాఘవాపురం గ్రామానికి చెందిన చెవుల నారాయణమ్మ కడు బీదరాలు. ఆమెకు పిల్లలు లేరు. భర్త మరణించగా ఒంటరిగా జీవిస్తున్నది. ప్రభుత్వం ఇచ్చే పింఛన్ డబ్బుతో జీవిస్తుంది. ఖర్చుల కోసం కూలినాలి పనులకు వెళ్తుంది. రోడ్డు ప్రమాదంలో విగతజీవిగా మారడంతో గ్రామస్తులు కంటతడి పెట్టారు.

### జీవన పోరాటంలో నిలిచి.. ప్రమాదంలో ప్రాణం విడిచింది

విజయరాఘవాపురం గ్రామానికి చెందిన రెమిడాల సౌభాగ్యమ్మ (75) ముగ్గురు కూతుర్లకు పెళ్లిళ్లు చేసి జీవన పోరాటంలో నిలిచింది. చరమాంకంలో కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్న ఆమె రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు విడిచింది.



ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో నుజ్జునుజ్జయిన కూలీల ఆటో

### మరణంలోనూ వీడని దాంపత్యం

రోడ్డు ప్రమాదంలో విజయరాఘవాపురం గ్రామానికి చెందిన కందుల నాగమ్మ (65), గురువయ్య(70) దంపతులు మృతిచెందగా.. కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. నాగమ్మ సంఘటనా స్థలంలో మృతిచెందగా.. గురువయ్య హైదరాబాద్ దవాఖానలో చికిత్స పొందుతూ ప్రాణాలు వదిలాడు.



పుట్టంగండి పంప్‌హౌస్

# పుట్టంగండి పంప్‌హౌస్‌కు మరమ్మతులు

**సీపేజ్‌ను అరికట్టేందుకు రూ.33 లక్షలతో గ్రౌటింగ్ పనులు**

పెద్దఅడిశర్లపల్లి, ఫిబ్రవరి 28 : ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టులో కీలక భాగమైన పుట్టంగండి పంప్‌హౌస్‌లో కొద్ది రోజులుగా గ్రౌటింగ్ పనులు కొనసాగుతున్నాయి. పంప్‌హౌస్ పైపులైన్ భాగంలో కాంక్రీట్ గోడ నుంచి కొద్ది రోజులగా సీపేజ్ నీరు వస్తుంది. దాంతో దానికి అనుకుని ఉన్న ఇనుప పిల్లర్లు తుప్పు పట్టడంతో మరమ్మతుల కోసం కేసీఆర్ ప్రభుత్వం రూ.35 లక్షలు మంజూరు చేసింది. ఆ నిధులతో కొద్ది రోజులుగా గోడలకు గ్రౌటింగ్ చేపట్టి లీకేజీలను అరికడుతున్నారు. భవిష్యత్‌లో పంప్‌హౌస్‌కు ఎటువంటి ప్రమాదం ఉండకుండా గత ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టగా పనులు వేగవంతంగా నడుస్తున్నాయి.



పంప్‌హౌస్‌లో చేపడుతున్న గ్రౌటింగ్ పనులు

